ఆనందరావు ఇంట్లోనుండి సీసాలు పగలకొడుతున్న చప్పుడు విని, వెంకటరావు నిద్ర లేచి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, టైము చూసుకున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంటన్నర అయింది. ఇంత అర్ధరాత్రి వేళ ఏమిటి సీసాలు పగులుతున్న చప్పుళ్ళు? కొంప దీసి ఆనందరావు ఈ రోజు మరీ ఎక్కువగా తాగి, తాగిన మైకంలో గొడవ చేస్తున్నాడేమో?

ఆనందరావుకు తాగి గొడవ చేయడమన్నది అలవాటే. ఆ గొడవకు అర్ధరాత్రి అపరాత్రి ఉండదు. నిజానికి తనూ తాగుతాడు. ఆనందరావు కంటే ఎక్కువే తాగగలడుకూడా. కానీ, తాగి అల్లరి మాత్రం చేయడు. అదీ తనలోని ప్రత్యేకత.

వెంకట్రావు మంచం మీదనుండి లేచి, చొక్కా తొడుక్కుని, ఆనందరావు ఇంటికి వెళ్ళి ఆశ్చర్యపోయాడు. ఆనందరావు పగల కొడుతున్నది ఖాళీసీసాలు కాదు. నిండు సీసాలు. కార్క్ వరకూ విస్కీతో ఉన్న నిండు సీసాలను పగల కొడుతున్నాడు.

వెంకట్రావు బిత్తరపోయి, వెంటనే తేరుకుని, ఆనందరావు చేయి పట్టుకుని అడిగాడు: "ఏమిటిది, ఆనందరావ్? ఏమిటీ పిచ్చిపని?"

ఆనందరావు మొహం పక్కకు తిప్పి చూశాడు. వెంటనే చేయి విదిలించుకుని, అల్మైరాలో ఉన్న మరొక సీసాను నేల మీదికి విసిరేశాడు. అది భళ్ళుమని శబ్దం చేస్తూ పగిలిపోయింది.

వెంకట్రావు నాలుగడుగులు ముందుకు వేసి, ఆనందరావు రెండు చేతులూ గట్టిగా పట్టుకుని, బలవంతాన పక్కనే ఉన్న కుర్చీలోనికి నెట్టాడు. ఆనందరావు కుర్చీలో కూలబడ్డాడు. వెంకట్రావు గట్టిగా ఊపిరి పీల్చుకుని నేలకేసి చూశాడు.

విరిగిన గాజుపెంకులు గది నిండా పడి ఉన్నాయి. కాలు వేస్తే కాటేసేస్తా మన్నట్లు వాడిగా మొన ఉన్న గాజుపెంకులు, 'నా బ్రతుకు అయిపోయింది' అని మొహం వాల్చేసిన గాజుపెంకులు, దీపం కాంతిలో మెరుస్తున్న చిన్న చిన్న గాజుముక్కలతో గది మొత్తం భీభత్సంగా ఉంది. సీసాలనుండి ఒలికిన విస్కీ అటూ ఇటూ జారిపోతూంది. తెల్లటి గది గోడలమీద విస్కీ తాలూకు మరకల చారలు కనబడుతున్నాయి. తాగుబోతుల కడుపులలో చల్లగా, చేదుగా, మత్తుగా జారవలసిన మధువు నేలపడి జాలిగా చూస్తున్నట్లు ఉంది.

ఆనందరావును కోపంగా చూస్తూ, ఒలికిన విస్కీ ఎంత మత్తును ఇవ్వగలదో అంచనా వేస్తూ వెంకట్రావు అన్నాడు



"ఆనంద్! నీకు ఏమయినా మతి చలించిందా? అమృతం లాంటి మధువును నేలపాలు చేస్తావా?"

'అమృతం కాదు, వెంకట్రావ్! అది విషం! మనుషుల మస్తిష్కాన్ని మైకంతో విరిచివేసే విషం అది. మనుషులను జంతువులుగా మార్చివేసే పాయిజన్. డెడ్లీ పాయిజన్!'

వెంకట్రావు ఆశ్చర్యపోయాడు. ముఖ్యంగా ఆనందరావు నుండి ఇటువంటి మాటలు అతను ఊహించలేదు.

'నేను చనిపోయేటప్పుడు నా నోట్లో పోయవలసినది తులసితీర్థం కాదు. ఒక పెగ్గు విస్కీ' అని నవ్వుతూ అనే ఆనందరావేనా ఇతను? 'మీరు తాగుడు మానతారా, మానరా? మీకు నేను కావాలో లేక ఆ తాగుడే కావాలో నిర్ణయించుకోండి' అని అతడి భార్య నిలదీసి అడిగినప్పుడు 'శాంతీ! నువ్వు నేను కట్టుకున్న భార్యవు. కానీ, ఈ తాగుడు ఉంది చూశావూ, అది నన్ను కట్టుకుంది. ఎలా మానను, చెప్పు?' అని సమాధానం చెప్పిన ఆనందరావేనా ఇతను? 'వెంకట్రావ్! మనల్ని గూర్చి లోకం అనేకమైన కారుకూతలు కూస్తూంది. ఎందుకో తెలుసా? తాగి ఆనందించడానికి గుండె కావాలి. అది మనకు ఉంది. దానికి లేదు. అందుకే అది ఎప్పుడూ మనల్ని గూర్చి చెడ్డప్రచారం చేస్తుంది' అనే త్రాగుబోతేనా ఇతను?

వెంకట్రావు నేలమీద ఉన్న గాజు పెంకుల మీద అడుగు వేయకుండా, జాగ్రత్తగా కొద్ది దూరంలో ఉన్న కుర్చీని ఆనందరావు ముందుకి లాక్కుని, మౌనంగా,వింతగా ఆనందరావుని చూశాడు.

ఆనందరావు మొహం చెమటతో తడుస్తూంది. గుండ్రంగా బిందువుల లాగ ఏర్పడి, లైటుకాంతిలో తళుక్కున మెరిసి, చెక్కిళ్ల మీదకు జారిపోతున్నాయి చెమట బిందువులు. మొహం మీద పడ్డ వెంట్రుకలు మొహంమీద చెల్లాచెదురుగా అతుక్కుని ఉన్నాయి. ఎంతో ఆవేదనను అనుభవిస్తున్నట్లు మొహమంతా ఎర్రగా కందిపోయి ఉంది.

'ఆనంద్! ఈ రోజు ఎందుకో నీ మాటలూ, చేష్టలూ చాలా వింతగా ఉన్నాయి. అసలు ఏం జరిగిందో చెప్పవూ?' వెంకట్రావు అడిగాడు.

'నేను త్రాగుడు మానేస్తున్నాను, వెంకట్రావ్. ఇక ఎప్పుడూ దాని ఛాయలకు పోను.' ఆనందరావు.

వెంకట్రావు కాస్సేపు ఆలోచించాడు. త్రాగుడు మానేస్తున్నానని ప్రతి త్రాగుబోతూ అంటూనే ఉంటాడు. అందులో ఏమీ కొత్త లేదు. సిగరెట్

# కోట్ల సత్యనారాయణ ప్రసాద్

మానేస్తున్నానని సిగరెట్ త్రాగేవాడు, త్రాగుడు మానేస్తున్నానని త్రాగుబోతు, రేపటినుండి వ్యభిచరించనని వ్యభిచారీ, అలాగే జూదరీ అంటూనే ఉంటారు. వాళ్ళు మానడం కానీ మారడం కానీ వెంకట్రావు చూడలేదు.

మనిషి వ్యసనానికి బానిస. అతడు వ్యసనానికి దూరంగా ఉన్నంత సేపే కానీ, ఆ వ్యసనపు సంకెళ్ళను తగిలించుకున్నాక వాటిని ఛేదిస్తాడన్నది సాధ్యం కాదు. పోతే ప్రతి వాడూ ఆ వ్యసనపు సంకెళ్ళనుండి బయట పడాలనే తీవ్రంగా ప్రయత్నిస్తాడు. ఎక్కడో మాటికో, లక్షకో ఒకడు బయట పడతాడు. తతిమ్మా వాళ్ళు రోజూ అలాగ అనుకుంటూనే ఆత్మవంచన చేసుకుంటారు. కొంతకాలానికి తాము ఆత్మవంచన చేసుకుంటున్నామనికూడా తెలుసుకుంటారు. ఆ పరిస్థితి వచ్చాక 'ఇక మానలేను. ఇక ఈ జీవితం ఇలా సాగిపోవలసిందే' అని తమ బానిసత్వాన్ని స్థిరపరచుకుంటారు.

'త్రాగడం మానేస్తే మంచిదే. ఐ ఎప్రీషియేట్. కానీ, నిండు సీసాలు పగల కొట్టుకుంది చూశావూ' అది చాలా తొందరతనం. రేపు మళ్ళీ నువ్వు త్రాగాలని అనుకోవచ్చుగా. . .'

'రేపు నేను త్రాగను.'

'పోనీ, పది రోజులు పోయాక.'

'డోంట్‌టాక్ రబ్బిష్. అసలు నా జీవితంలో దానివంక కన్నెత్తి అయినా చూడను.' ఆనందరావు అన్నాడు.

వెంకట్రావు దీర్ఘంగా నిట్టూర్చాడు. ఆనందరావు వాలకం చూస్తూంటే చాలా ఉద్రేకంగా కనపడుతున్నాడు. ఎందుకిలా తయారయ్యాడు? ఏమయి ఉంటుంది? అతడి భార్యకు కానీ, అతడి పిల్లలకు కానీ...

వెంకట్రావు మొహం లోని భావాలను పసిగట్టినట్లు చూసి, నవ్వి, ఆనందరావు అన్నాడు: 'నేను ఎందుకు ఇలాగ మాట్లాడుతున్నానని ఆశ్చర్యపోతున్నావు కదూ? అవునా?'

వెంకట్రావ్ 'అవు'నన్నట్లు తల ఊపాడు.

ఆనందరావు గంభీరంగా తయారయాడు. కుర్చీలో నుండి లేచి, షెల్ఫు దగ్గరకు వెళ్ళి, షెల్ఫులోని ఆఖరి సీసాను దూరంగా గోడకేసి విసిరి అన్నాడు: 'వెంకట్రావ్! త్రాగుబోతుల జీవితం పగిలిన సీసాలాంటిది. విరిగిన ఆర్థికస్థితీ, పగిలిన దాంపత్యం, ముక్కలైన కట్టుబాటూ, ఛిన్నాభిన్నమయే భవిష్యత్తూ! అందుకే ఈ సీసాల్ని పగలగొట్టి నా జీవితాన్ని అమర్చుకుందామని అనుకుంటున్నాను.

'ఆశ్చర్యంగా ఉంది కదూ, వెంకట్రావ్! ఈ బుద్ధి ఇంతకు పూర్వం ఎందుకు పుట్టలేదని అనుకుంటున్నావు కదూ?'

'వెంకట్రావ్! కొందరు జీవితంలో ఏదో దెబ్బ తిని మారతారు. మరికొందరు ఎదుటివాళ్ళు తిన్న దెబ్బల్ని చూసి మారతారు. కానీ, నేను మాత్రం ఈ రెండిటి కోవకూ చెందను. నేను ఒక పుస్తకం చదివి మారిపోయాను.'

'పుస్తకమా? !'

'అవును. ఒక నవల! మన లాంటి త్రాగుబోతులను గురించి వ్రాసిన నవల. నవల పేరు 'త్రాగుబోతులు' అని ఎదురుగా టేబుల్ మీద ఉన్న పుస్తకాన్ని వెంకట్రావుకు అందిస్తూ, 'ఈ నవల నా ఆరిపోతున్న జీవితానికి ప్రాణం పోసింది, వెంకట్రావ్' అన్నాడు.

వెంకట్రావు ఆ నవలను ఎడంచేత్తో పట్టుకుని, కుడిచేత్తో ఒక పేజీ తిరగేశాడు.

'నా నవలను చదివి ఒక్క త్రాగుబోతయినా త్రాగుడు వ్యసనాన్ని మానుకుని, మార్పు చెందితే, అదే నా ఆత్మశాంతి.

—రచయిత.


వెంకట్రావు నుదుటి మీద పట్టిన చెమటను తుడుచుకున్నాడు. అతడికి చాలా వింతగా ఉంది. ఎవరయినా నవలల వలన, నాటకాల వలన మారతారా? నవల మనిషిలో అంత పరివర్తనను కలిగిస్తుందా? ఇది సాధ్యమేనా?

వెంకట్రావు ఆ పేజీ మూసేస్తూ, అడిగాడు: 'ఈ నవలలో ఏ ముంది?'

'మన జీవితం.' ఆనందరావు చెప్పాడు.

'అది మనకూ తెలుసు.'

ఆనందరావు దీర్ఘంగా నిట్టూరుస్తూ 'నీ మొహం ఎలా ఉందో నీకు తెలుసా, వెంకట్రావ్? అద్దంలో చూస్తేనే కాని తెలియదు. అద్దంలో చూసుకుని "నేను ఇలాగ ఉంటాను" అనుకుంటావు. అందంగా ఉంటే అందంగా ఉన్నానని అనుకుంటావు. వికృతంగా ఉంటే





ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మికి "సప్తగిరి సంగీత విద్వన్మణి" బిరుదును ఇటీవల తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర త్యాగరాజ ఉత్సవాల సంఘం వారు సమర్పించారు. ఆ సందర్భంగా శ్రీమతి రాజు బిరుదు చిహ్నలుగా సువర్ణ పతకం, బంగారు గొలుసు అందజేశారు. చిత్రంలో శ్రీ టి. సదాశివం, టి. టి. డి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ రాజగోపాల రాజు, శ్రీ ఎమ్. కృష్ణస్వామి, శ్రీ నేదునూరి కృష్ణమూర్తి, శ్రీమతి సుబ్బులక్ష్మి ప్రభృతులు ఉన్నారు.

అందంగా మారడానికి ప్రయత్నిస్తావు. ఈ నవల మన జీవితాలకు అద్దం లాంటిది'' అన్నాడు.

'అది సరే! ఈ నవల ఏమిటో చెప్పావు కాదు.' వెంకట్రావు విసుగ్గా అన్నాడు.

ఆనందరావు గట్టిగా ఊపిరి పీల్చుకుని, నుదుటిమీద పట్టిన స్వేదబిందువులు తుడుచుకుని అన్నాడు: "ఈ నవల వలన పేరు పొందిన రాజారావు వాకు ప్రెజెంట్ చేశాడు ఈ నవలని.

'ఈ నవల ముకుందరావు అనే త్రాగుబోతును గూర్చి రాసినది.

'ముకుందరావు ఒక రోజు యాథాలాపంగా "కంపెనీ" కోసం త్రాగుతాడు. మనం ఒక రోజు త్రాగినట్లే. రెండో సారీ, మూడో సారీకూడా మన లాగే ఏమీ తోచక త్రాగుతాడు. మనం అయితే అతడికికూడా వ్యసనం అయిపోతుంది. పగలూ, రాత్రీ త్రాగనిదే బతకలేను అని అనుకుంటాడు.

'నెలకు ఆరు వందల రూపాయల జీతం ఉన్నవాడు రోజుకు ఇరవై రూపాయల త్రాగుడు త్రాగితే ఏమవుతుంది? మనకి లాగే అతడి ఆర్థిక స్థితికూడా ఛిన్నాభిన్నమవుతుంది. అతడి భార్య దారిద్ర్యం అనుభవించి, అనుభవించి, తన భర్తను మార్చాలని అన్ని ప్రయత్నాలూ చేసి చేసి, విఫలం చెంది, నా భార్య శాంతిలాగ, నీ భార్య జయంతి లాగ పుట్టింటికి వెళ్ళిపోయింది.

'భార్యా పిల్లలు పుట్టింటికి పోయాక ముకుందరావు ఇంతవరకూ కంటె త్రాగినట్లే మరీ ఎక్కువగా త్రాగుతాడు. అతడి కళ్ళకు ప్రపంచమంతా "విస్కీ" మయం లాగ కనపడుతుంది. పగలుకీ, రేయికీ భేదం తెలియనంతగా, తన బాధ్యతను, తన మీద ఆధారపడే వాళ్ళను మరిచిపోయేటంతగా త్రాగుతాడు. అంతవరకూ మన జీవితం ముకుందరావు జీవితం ఒక లాగే గడిచింది.'

'ఆ తరవాత ఏమవుతుంది?' వెంకట్రావు అడిగాడు.

ఆనందరావు మొహం ఎర్రబడింది. అతడి మొహంలోని రక్తనాళాలు పగిలిపోతాయన్నంతగా అవి ఉబ్బి బయటకు కనపడుతున్నాయి. త్రాగుబోతులకు, సహజంగా ఉండే 'ఆల్కహాలిక్ మ్యగ్నటేన్'కు ఉద్రేకం తోడవడం వలన అతడి కాళ్ళూ చేతులూ అమితంగా వణుకుతున్నాయి.

ఆనందరావు నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు. కుర్చీ చేతిమీద చేయి ఉంచి, ఆ చేతిమీద మొహం ఆన్చి, కొన్ని క్షణాలు కళ్ళు మూసుకున్నాడు.

'ఆ తరవాత ఏమవుతుంది?' అతడిని కుదిపుతూ వెంకట్రావు అడిగాడు.

ఆనందరావు కళ్ళు తెరిచి, విషాదంగా వెంకట్రావును చూసి అన్నాడు: 'ఏమవుతుంది? ముకుందరావు ఉద్యోగం ఊడుతుంది. ముకుందరావుకు "లివర్ సిరోసిస్" వస్తుంది. అత్యంత హీనంగా, భరించలేని ప్రాయశ్చిత్తంతోనూ, చేతకానితనంతోనూ ముకుందరావు చస్తాడు.

'అతడి భార్యా పిల్లలూ. . .' ఆనందరావు తల విదిలించి, 'చెప్పలేను, వెంకట్రావ్. చెప్పలేను. అతడి భార్యను గురించి ఆలోచిస్తూ ఉంటే నా శాంతి గుర్తుకు వస్తుంది. నా బాబూ, జయా గుర్తుకు వస్తున్నారు. నేను త్రాగినది వారి రక్తమేమోనని భయం వేస్తుంది. భగవాన్! నన్ను క్షమించు' అంటూంటే ఆనందరావు కళ్ళమ్మట నీళ్ళు కారిపోయాయి.

వెంకట్రావు కొంతసేపు ఆనందరావును చూస్తూండిపోయాడు. అతడిలో జరుగుతున్న సంక్షోభం గుర్తించి, లేచి అన్నాడు: 'ఆనందరావ్! ఇటువంటి పరిస్థితులలోనే మనల్ని మనం నిలదొక్కుకోవాలి. గతాన్ని తలుచుకుని క్రుంగిపోకూడదు. గతం నేర్పిన పాఠాల్ని వర్తమానంలో ఉపయోగించుకుని, భవిష్యత్తును బాగుచేసుకోవాలి. మరి నేను వస్తా. ఈ నవలను తీసుకెళుతున్నాను.'

ఆనందరావు కళ్ళు మూసుకునే 'తీసుకెళ్ళ'మన్నట్లు తల ఊపాడు. వెంకట్రావు వెళ్ళిపోయాడు. ఆనందరావు కనులలో గతం తెరలు తెరలుగా మెదలసాగింది.

పెళ్ళయిన కొత్తలో తనూ, తన భార్య శాంతీ ఎంత ఆనందంగా గడిపారు! తనకు తెలియకుండానే రోజులూ, నెలలూ, సంవత్సరాలూ ఎలా కదిలేవి? తన వ్యాపారం ఎన్ని లాభాలతో ముందుకు సాగిపోయింది! తనకు మగపిల్లాడు పుట్టాడని ఎంతగా పొంగిపోయాడు! ఆడపిల్లకూడా కావాలని అనుకున్నప్పుడు, ఆడపిల్ల పుట్టినప్పుడు తన పిల్లలిద్దర్నీ రెండు కళ్ళుగా చూసుకోలేదూ?

ఆ రోజు! తను త్రాగుబోతుగా దిగజారడానికి పునాది పడిన రోజు!

'ఒక్క పెగ్గు త్రాగి చూడు, ఆనందరావ్. ఈ పెగ్గుతో నువ్వేమీ త్రాగుబోతువు కావడం లేదులే.'

మొహమాటానికి త్రాగాడు, అంతే! అది తన పాలిట విషంలాగ, తన కడుపులోకి కాలుతున్న పెట్రోలు లాగ జారింది. తన కుడుల్లో, తన గుండెల్లో, తన మస్తిష్కంలో వీడని మత్తు.

ఆనందరావు ఒక గంట సేపు అలాగే అలసటగా కుర్చీలో జారగిలబడిపోయాడు. గతంలోని ఆనందతరంగాలు, విషాద సంఘటనలూ అతడిని అమితంగా కలవర పెడుతున్నాయి. అతడి భార్య దీనస్వరూపమూ, అతడి పిల్లలూ మెదలుతున్నారు. అతడి భార్యా పిల్లల పట్ల అమితమైన జాలి, తన పట్ల విపరీతమైన అసహ్యం ఆవరించుకున్నాయి.

హఠాత్తుగా అతడిలో తను శాంతినీ, పిల్లల్నీ చూస్తాడో లేదోనని అనుమానం బయలుదేరింది. ఆ భయంతో అతడి గుండెలు అదిరాయి. వాళ్ళెలా ఉన్నారో, ఏమో? వెంటనే తను వెళ్ళి, వాళ్ళను వెంటపెట్టుకుని రాకపోతే ఏమౌతుందో నని ఆవేదన రగులుకుంది.

ఆనందరావు ఒక్క ఉదుటున లేచి నించున్నాడు. జేబులో డబ్బు లెక్కపెట్టుకున్నాడు — మూడు వందలు ఉన్నాయి. ఒక జత బట్టలు సూట్‌కేస్‌లో పెట్టి, బయటకు వస్తూ ఉంటే విన్నాడు వెంకటరావు ఉండే వాటాలోనుండి సీసాలు పగలగొడుతున్న శబ్దం.

ఆనందరావు ఉలిక్కిపడి, అర్థం చేసుకుని నవ్వుకున్నాడు. వెంకట్రావు కూడా మారిపోయాడన్న మాట. తనకా నమ్మకం ఉంది. ఆనందరావును చూస్తూ అన్నాడు: 'నేనుకూడా మారిపోయాను, ఆనంద్! ఇక నా జీవితంలో ఎప్పుడూ త్రాగను. ఈ సభల నా జీవితానికి జ్ఞానోదయాన్ని ఇచ్చింది.'

ఆనందరావు ఆ పుస్తకాన్ని జాగ్రత్తగా సూట్‌కేస్‌లో పెట్టుకుంటూ, 'నేను శాంతిని, పిల్లల్ని తీసుకురావడానికి వెళుతున్నాను' అన్నాడు.

'నేను కూడా బయలుదేరుతున్నాను' వెంకట్రావు అన్నాడు.

•

ఆనందరావుకు తన భార్యా పిల్లల్ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించింది. అతడు భయపడినట్లు వారికి ఏమీ కాలేదు. అతడు ఎక్కువగా ఆనంద పడడానికి కూడా అవకాశం లభించలేదు.

అతడి భార్యలో పూర్వపు ఆరోగ్యం కనపడలేదు. సన్నగా, విచారంగా, రోగిష్టి దానిలాగ ఉంది. ఆమె కనుల చుట్టూ నల్లటి చారలు కమ్ముకున్నాయి. పిల్లలు బొద్దుగా, ఎర్రగా, ముద్దు వచ్చేలాగా లేరు. సన్నబడి, నల్లబడి, అనారోగ్యం గూడు కట్టుకున్నట్లు ఉన్నారు.

పిల్లల్ని ఒడిలోకి తీసుకుని కుర్చీలో కూలబడ్డాడు. అతడి అత్తమామలు, బావమరదులూ విసిరిన సూటి పోటి మాటల్ని మౌనంగా భరించాడు. 'నువ్వింత త్రాగుబోతువని తెలియక మా పిల్ల గొంతు కోశాము. ఛీ! ఎంత కొచ్చిన చదువు, సంస్కారం లేకపోయాక!' అన్న మాటలు తల వంచుకుని స్వీకరించాడు.

అతడి భార్యలోని కన్నీరు అతడిని కుదిపివేసింది. పిల్లలలోని నిస్పృహ అతడిని నిలువునా క్రుంగదీసింది. 'ఛఛ! ఎంత అసహ్యంగా, ఎంత క్రూరంగా ప్రవర్తించాను!' అనుకున్నాడు.

ఆ రోజు రాత్రి అతను భార్యనీ, పిల్లల్నీ తీసుకుని బయలుదేరుతున్నప్పుడు అతడి అత్తగారు కళ్ళనీళ్ళతో—'చూడు, బాబూ! నీ భార్య ఆరోగ్యం ఏమీ బాగాలేదు. నీ సంగతి తెలిసి ఉండీకూడా నీకూడా పంపుతున్నాం. ఏం చేస్తావో' అన్నప్పుడు 'నేను నిజంగానే త్రాగుడు మానేశాను. నన్ను నమ్మండి. ఈ విషయం ఒక వారం రోజుల్లో శాంతి మీకు తెలుపుతుంది' అన్నాడు.

రైలుస్టేషనులో ప్రయాణీకుల రద్దీని చూసి, తన భార్య ఆరోగ్యస్థితి మనస్సులో ఉంచుకుని ఫస్ట్‌క్లాస్ టికెట్లు తీసుకున్నాడు.

ఫస్ట్ క్లాసు కంపార్టుమెంట్ ఎక్కి చుట్టూ చూశాను. ఎవరో ఒకతను పై బెర్తు మీద పడుకుని ఉన్నాడు. మరి ఇంకెవరూ లేరు. ఆనందరావు తృప్తిగా నిట్టూర్చాడు. తన గుండెలో రగులుతున్న పశ్చాత్తాపం తన భార్య ముందు ఉంచి, ఆమెను శాంతి పరచవచ్చు.

రైలు గట్టిగా కూత కూసి కదిలింది. ఆనందరావు సూట్ కేస్ తెరిచి, దారిలో తాను కొన్న బిస్కట్ పాకట్ తీసి, తన పిల్లల ముందు ఉంచాడు. శాంతి అతడిని ఆశ్చర్యంగా చూస్తోంది. ఆమెకు నమ్మశక్యం కాకుండా ఉంది. ఆనందరావు త్రాగుడు మాని, బాగుపడతాడనే నమ్మకం ఆమెలో క్షీణించింది. మరి ఇదేమిటి?

ఆనందరావు పక్కకు తిరిగి అన్నాడు: 'శాంతీ! ఏమిటి దీక్షగా చూస్తున్నావు?'

'మీరు నిజంగా త్రాగుడు మానేశారా?'

ఆనందరావు గుండె బరువెక్కిపోయింది. గతంలోని అతడి ప్రవర్తన అతడి కనుల ముందు తెరలు తెరలుగా మెదిలింది. ఆమెను తన గుండెలకు గాఢంగా హత్తుకుని, 'నీ మీద, పిల్లల మీద ప్రమాణం చేస్తున్నాను, శాంతీ. నేను ఇంక ఎప్పుడూ త్రాగను, నన్ను నమ్ము' అనాలని అనిపించింది.

అతడు గొంతుక సవరించుకుని ఏదో చెప్పబోయాడు. ఇంతలో పై బెర్తు మీద పడుకున్న మనిషి లేచి, తూలుతూ పైనుండి క్రిందకు దిగి, ఆనందరావుకు ఎదురుగా ఉన్న బెర్తు మీద కూలబడ్డాడు. దానితో ఆనందరావు చెప్ప దలుచుకున్నది అతడి గొంతుకలోనే ఉండిపోయింది. కోపంగా అతడిని చూశాడు.

అతను (ఆ పై బెర్తు మీద నుండి దిగిన మనిషి) పైజామా, లాల్చీ తొడుక్కున్నాడు. అతడి జుత్తు అతడిలాగానే నిలకడ లేకుండా అటూ ఇటూ పడి ఉంది. అతడి కనులు త్రాగుబోతుల కళ్ళలా ఎర్రగా వాచి ఉన్నాయి. అతడి లాల్చీ జేబులోనుండి క్వార్టర్ విస్కీ బాటిల్ మూత బయటకు తొంగి చూస్తోంది.

అతడు ఆనందరావుని చూసి అడిగాడు: 'రాజమండ్రి ఇంకా ఎంత దూరంలో ఉంది, బాబూ?'

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు, ఇంకెక్కడి రాజమండ్రీ! రాజమండ్రి దాటి గోదావరి స్టేషను వస్తూ ఉంటే! ఆ మాటే అన్నాడు.

అతను ఆశ్చర్యపోయాడు. వెంటనే లేచి, తూలి, తనను తాను నిలదొక్కుకుని, 'బతికిపోయాను. విజయవాడ వచ్చాక మెలుకువ రాలేదు' అని గట్టిగానే అనుకున్నాడు.

ఆ త్రాగుబోతుకు ఏదో గుర్తుకు వచ్చినట్లుంది. విచిత్రంగా చుట్టూ చూసి, 'ఇదేమిటి, బాబూ! ఈ రోజు కంపార్టుమెంటులో జనం ఇంత తక్కువగా ఉన్నారు?' అన్నాడు. ఆ మాట అంటూ ఉంటే అతడి నోటి నుండి విస్కీ వాసన గుప్పున కొట్టింది.

'ఇది ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటు. సెకండ్ క్లాసు కాదు.' ఆనందరావు కోపంగా అన్నాడు.

అతడు లాల్చీ జేబులోనుండి టికెట్ తీసి చూసుకుని, బిగ్గరగా నవ్వుతూ, 'త్రాగుబోతుల కనులకు ఫస్ట్‌క్లాసుకూ, సెకండ్ క్లాసుకూ భేదం తెలియదు తమ్ముడూ! మనుష్యులలో క్లాసుల లాగ రైళ్ళలో కూడా ఉన్నాయని మరిచిపోతారు' అన్నాడు.


ఆనందరావుకు చాలా కోపమొచ్చింది. ముఖ్యంగా 'తమ్ముడూ' అన్న పదం అతడిని చాలా ఆగ్రహపరిచింది. పరివర్తన పొందిన ఆనందరావులో త్రాగుబోతుల్ని అర్థం చేసుకునే వివేకం తగ్గిపోయింది.

'చూడు, మిస్టర్! సెకండ్ క్లాస్ టికెట్టుతో ఫస్ట్ క్లాసులో ప్రయాణం చేస్తున్నందుకు నిన్ను టికెట్ కలెక్టరుకు అప్పజెప్పవలసి ఉంటుంది, నువ్వు ఇంక ఏమయినా మాటలాడితే.'

ఆ త్రాగుబోతు మొహంలో రంగులు మారాయి. ఆనందరావు అన్న మాటలు అతడికి సూటిగా తగిలాయి, తనలో తను గొణుక్కుంటూ బెర్తు మీద కూర్చుండి పోయాడు.

సిగ్నల్ ఇవ్వకపోవడం వలన గోదావరి స్టేషనుకు కొస్త దూరంలో రైలు ఎలుగెత్తి అరుస్తూ ఆగిపోయింది. ఆ త్రాగుబోతును శాంతీ, పిల్లలూ భయంగానూ, ఆశ్చర్యంగానూ చూస్తున్నారు.

ఆనందరావులో కొన్ని గర్వం తల ఎత్తింది. తను అదిలాయించడం, ఆ త్రాగుబోతు గొణుక్కుంటూ కూర్చుండి పోవడం తన సుపీరియారిటీని వెల్లడి చేశాయి. ఆ త్రాగుబోతు మీద కాస్త జాలికూడా ఏర్పడింది. తనూ కొన్ని రోజుల క్రితం ఇలాగ త్రాగి మాటాడిన వాడే!



ఆనందరావు జాలిగా చూస్తూ అన్నాడు: 'చూడు, మిస్టర్! ఈ తాగుడు మానలేవా?'

అతడు తల ఎత్తి ఆనందరావును చూసి, తల తిప్పేసుకున్నాడు.

ఆనందరావు సూట్‌కేస్ తెరిచి, అందులోనుండి 'త్రాగుబోతులు' నవలను బయటికి తీసి, అతడికి చూపిస్తూ అన్నాడు: 'కొన్నాళ్ళ క్రితం దాకా నేనూ నీలాంటి త్రాగుబోతునే. కానీ, ఈ నవల చదివాక నాలో మార్పు కలిగింది. ఇది త్రాగుడు ఎలా అలవాటు అవుతుందో, మనిషి దానికి బానిస ఎలా అవుతాడో, తరవాత ఎలా పతనం చెందుతాడో వివరంగా ఉన్న గొప్ప నవల. ఇది చదివి నువ్వు కూడా నీలో మార్పును వరిపెట్టుకుంటావేమో?'

ఆ త్రాగుబోతు కళ్ళు మెరిశాయి ఆనందంగా. ఆనందరావును విచిత్రంగా చూస్తూ, 'ఈ నవలను చదివి మీరు మారారా?' అని అడిగాడు.

ఆనందరావు పక్కకి తిరిగి భార్యకేసి చూశాడు. ఆమె ఆశ్చర్యంగా చూస్తోంది. ఆనందరావు భక్తిగా ఆ పుస్తకాన్ని చూస్తూ అన్నాడు: 'అవును — ఈ నవలను చదివే నేను మారాను. ఈ నవల చదివే నేను ఏ స్థితిలో ఉన్నానో గుర్తించాను. నిజం చెప్పాలంటే, నేను ఇలా నా భార్యనూ, నా పిల్లలనూ తీసుకుని వెళుతున్నానంటే కారణం— ఈ పుస్తకమే! ఈ పుస్తకం కొని, నువ్వు కూడా చదువుతావుగా?'

'ఈ పుస్తకాన్ని కొని, చదువవలసిన అవసరం నాకు లేదు, బాబూ! ఈ నవల రచయితను నేనే! నేను రాసిందే ఈ నవల!' అతడు తాపీగా అన్నాడు.

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు. అతడికి తన చెవులు తనను మోసగించాయేమోనని అనిపించింది. అతడికి ప్రపంచం మొత్తం గిర్రున తిరిగిపోయినట్లు అయింది. 'ప్రళయం వచ్చేసింది. భూమి సముద్రంలో కొట్టుకుని పోతూంది. నువ్వు కూడా మునిగిపోతున్నావు!' అని ఎవరైనా అంటే నమ్మగలిగేవాడేమో కాని, ఇదిమాత్రం నమ్మశక్యంగా అనిపించలేదు.

'ఇంపాసిబిల్. ట్రాష్. అబద్ధం. పచ్చి అబద్ధం.' గట్టిగా అనేశాడు.

'నాకు తెలుసు, బాబూ, నువ్వు నమ్మలేవు. నువ్వేకాదు చాలా మంది నమ్మలేరు.'

'ఈ నవలను మీరే వ్రాశారు అని నమ్మడానికి ఏమిటి ఆధారం?' ఆనందరావు అడిగాడు.

అతడు ఆనందరావు చేతిలోనుండి పుస్తకాన్ని తీసుకుని, రెండు పేజీలు తిరగవేసి, రచయిత ఫొటో చూపిస్తూ, 'చూడు, రచయిత ఫొటో! ఈ ఫొటో చూసి నన్ను గుర్తించలేవూ?' అన్నాడు.

ఆనందరావు ఆ ఫొటోను తేరిపార చూశాడు. నిజమే! అతడి ఫొటోయే అది!

ఆనందరావు గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. ఏమిటిది! తనను ఇంతగా కుదిపివేసి, తనలో చైతన్యం తెచ్చిన రచయిత త్రాగుబోతా!

ఆనందరావు అతడిని వెర్రిగా చూస్తూ 'మీరు త్రాగుబోతా? మీరు — మీ రచనలతో మాలాంటి వాళ్ళకు కనువిప్పు కలిగించిన మీరు త్రాగుబోతా?' అని అడిగాడు.

అతడు లేచి నించున్నాడు. 'అవును, నేను త్రాగుబోతునే.'

'నాకు ఆశ్చర్యంగా ఉంది, సార్.' ఆనందరావు.

అతడు చేతులతో కనులను గట్టిగా రుద్దుకుంటూ అన్నాడు: 'మా నాన్న త్రాగుబోతు. త్రాగి పిచ్చి మా అమ్మను కొట్టేవాడు. మా అమ్మ ఏడుస్తూ కూర్చునేది. నన్ను గుండెలకు హత్తుకుంటూ ఏడిచేది మా అమ్మ ...'

అతడు ఉద్రేకంగా లాల్చీ జేబులోనుండి క్వార్టర్ విస్కీ బాటిల్ తీసి, మూత తెరిచి, గడగడా త్రాగేశాడు.



ఒకరికొకరు

ఫోటో— ఎస్. మల్లారెడ్డి ( మద్రాసు )

సిగ్నల్ ఇచ్చారు. రైలు మెల్లిగా కదలడం మొదలు పెట్టింది. ఆనందరావు లేచి, నిలుచుని అతడి రెండు చేతులూ పట్టుకుని కూర్చోబెట్టాడు. అతడు కళ్ళు తుడుచుకుని, ఆయాసపడి, 'మా అమ్మ చనిపోయిన రోజు నిశ్చయించుకున్నాను — మా నాన్నలోని పైశాచికత్వానికి కారణమయిన ఈ త్రాగుడును గూర్చి లోకానికి వెల్లడిచేయాలని, త్రాగుడు వలన మనుష్యులు ఎంత పతనమౌతారో తెలియజేద్దామని.'

అతడు హఠాత్తుగా మళ్ళీ లేచి, ఆనందరావును సూటిగా చూస్తూ అన్నాడు: 'త్రాగుబోతుల్ని మార్చడం కోసమనే ఈ నవల రాశాను, బాబూ! కానీ, రాసేటప్పుడు మా అమ్మ గుర్తుకు వచ్చేది. ఆమె కన్నీరు నా గుండెలను జల్లెడ చేసేసేది. నేను పిచ్చివాణ్ణి అయిపోతానేమోనని భయం వేసేది. అందుకే త్రాగాను; త్రాగుతూనే ఈ నవలను రాశాను. నా నవల పూర్తయింది. కానీ, ఈ వ్యసనం మాత్రం నాలో బలంగా నిలిచి పోయింది.'

ఆనందరావు కనులలోనుండి నీళ్ళు ధారగా ప్రవహిస్తున్నాయి. గోదావరి స్టేషను వచ్చేసింది.

ఆ రచయిత ఆనందరావు భుజం తట్టుతూ, 'చూడు, బాబూ! నువ్వు నా గురించి కంట తడి పెట్టకూడదు. ఏ రచయితా పాఠకుడి కన్నీటిని కోరడు. పాఠకుడి చిరునవ్వు, ఆనందం, ఉత్తేజం రచయితకు ఊపిరిని ఇస్తాయి. నా నవల వలన పరివర్తన చెందిన నీ లాంటివాళ్ళు పది మంది ఉంటే నాకు ఇంక ఏం కావాలి, చెప్పు? మనిషిగా నా జీవితం దెబ్బ తిని ఉండవచ్చు. రచయితగా నాకు లభించే తృప్తి, ఆనందం ఎంత మందికి ఉంటాయి?' అన్నాడు.

అతడు దిగిపోయాడు. ఆనందరావు కూడా అతడితోబాటు దిగి, మెల్లిగా అతడితో నడుస్తూ అడిగాడు: 'మీ నాన్నగారు ...?'

అతడు నిర్లిప్తంగా నవ్వుతూ అన్నాడు: 'ఈ ఊరి సెంట్రల్ జైల్లో క్షేమంగా ఉన్నారు.'

ఆనందరావు తలమీద బాంబు పడ్డట్టయింది. 'సెంట్రల్ జెయిల్‌లోనా...'

'అవును. త్రాగి పిచ్చి అమ్మను హత్య చేసినందుకు.' అతడు తొందర తొందరగా బయటకు వెళ్ళిపోయాడు.

ఎందుకో ఆనందరావుకు మిల్టన్ మాటలు గుర్తుకు వచ్చాయి. 'ఎ గుడ్ బుక్ ఈజ్ ఎ లైఫ్ బ్లడ్ ఆవ్ ఎ మాస్టర్ పొయెట్.' ★